'సైబర్ సెక్యూరిటీ'పై శిక్షణ ప్రారంభం

పలు రాష్ట్రాల నుంచి హాజరైన అభ్యర్థులు

శిక్షణకు హాజరైన సాఫ్ట్‌వేర్ నిపుణులు, శిక్షణ ఇస్తున్న సైబర్ ఫోరెన్సిక్ నిపుణుడు రాహుల్ గుప్తా(ఇన్‌సెట్‌లో)

పటాన్‌చెరు: హ్యాకర్ల దాడుల నుంచి తమ వెబ్‌సైట్లను, కంప్యూటర్లను రక్షించుకోవడంపై పాటించాల్సిన మెళకువలను తెలియజేసేందుకు మెదక్ జిల్లా ఓడీఎఫ్‌లోని హైదరాబాద్ ఐఐటీలో శనివారం శిక్షణ ప్రారంభమైంది.

ఎలాన్ పేరుతో ఐఐటీ విద్యార్థుల నేతృత్వంలో ప్రారంభమైన ఈ శిక్షణకు ఉత్తర్‌ప్రదేశ్, ఢిల్లీ, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి సుమారు 100 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వీరిలో ఇంజనీరింగ్ విద్యార్థులతో పాటు ప్రొఫెసర్లు, సెక్యూరిటీ విభాగం నిపుణులు పాల్గొన్నారు. సైబర్ టెక్నాలజీ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యం లో 28వ తేదీ ఆదివారం వరకు శిక్షణా కార్యక్రమం జరుగుతుంది.

ప్రతిష్ఠాత్మక సంస్థల వెబ్‌సైట్లను హ్యాకర్ల దాడి నుంచి ఎలా కాపాడుకోవాలి, కంప్యూటర్లలో డాటాను సురక్షితంగా ఎలా ఉంచుకోవాలి అనే అంశాలపై శిక్షణ కార్యక్రమం కొనసాగింది. సైబర్ క్యూర్ టెక్నాలజీ సంస్థకు చెందిన సెక్యూరిటీ ప్రొఫెషనల్ నిపుణుడు రాహుల్ గుప్తా ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. మొదటి రోజు శిక్షణలో భాగంగా విండోస్ సెక్యూరిటీ సిస్టం, ఈమెయిల్ కోరెన్సిక్, ఫిషింగ్, డాటా రికవరీ, ఈ మెయిల్ రేసింగ్, యూసింగ్ కీలాకర్ అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు.

ఆదివారం వరకు జరిగే ఈ శిక్షణా కార్యక్రమాలు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి మీడియా పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తోంది. హైదరాబాద్ ఐఐటీ యాజమాన్యంతో ఈ మేరకు ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేమూరి ఆదిత్య ఈ మేరకు ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు.

మహనీయుల త్యాగాల స్ఫూర్తితో

ముందుకు సాగాలి: నాదెండ్ల మనోహర్

సీతమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ నాదెండ్ల మనోహర్

మోండా: స్వాతంత్ర్య సముపార్జన కోసం ఎంతోమంది మహనీయులు చేసిన త్యాగాల స్ఫూర్తితో మన చరిత్ర, సంస్కృతీ సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పీకర్ నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం సికింద్రాబాద్ పరోపకారిణి బాలికోన్నత పాఠశాల సీతమ్మ బడి శతాబ్ది ఉత్సవాలకు ఆయన హాజరై సీతమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వందేళ్ల క్రితమే తెలుగు భాష కోసం పాఠశాలను ప్రారంభించిన సీతమ్మ తెలుగువారందరికీ ఆదర్శమన్నారు. బాలికలకు చదువు ఎంత అవసరమో గుర్తించిన సీతమ్మ తన సర్వస్వాన్ని త్యాగంచేసి పాఠశాలను ప్రారంభించడం అభినందనీయమన్నారు. విద్యారంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు ధీటుగా ఎదుర్కొంటూ వందేళ్లుగా పాఠశాల దినదినాభివృద్ధి సాధించడం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. గాంధీజీ సందర్శించి నడయాడిన ఈ పాఠశాలలో సీతమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించడం గర్వకారణంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా తనతల్లి స్మారకార్థం సీతమ్మబడి పాఠశాలకు రెండు కంప్యూటర్లను విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షురాలు డాక్టర్ టి.ఉష, మెంబర్ భారతి, విద్యాశాఖ ఆర్‌జేడీ లక్ష్మారెడ్డి, డీఈవో సుబ్బారెడ్డి, సీతమ్మ మునిమనవడు కేరళ కేడర్ డీఐజీ విక్రమ్, మునిమనవరాలు శకుంతల, పూర్వవిద్యార్థుల అసోసియేషన్ సభ్యుడు ప్రతిభారావు పాల్గొన్నారు.

'డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి'

విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

పంజాగుట్ట: విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం డీఎస్సీలో ప్రత్యేక విద్యా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ప్రత్యేక విద్యలో శిక్షణ పొందిన నిరుద్యోగ ఉపాధ్యాయుల సంఘం (ఏపీ) డిమాండు చేసింది. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో శనివారం విలేఖరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి జి.బాబు మాట్లాడారు. ప్రత్యేక విద్యలో డీఎడ్, బీఎడ్, ఉపాధ్యాయ శిక్షణ కోర్సులు పూర్తి చేసి సంవత్సరాలు గడుస్తున్నా డీఎస్సీలో పోస్టులను భర్తీ చేయడం లేదన్నారు. బడి బాట కార్యక్రమంలో రాష్ట్రంలో 2 లక్షల మంది వికలాంగుల పిల్లలున్నారని గుర్తించారని వారికి చదువు చెప్పడానికి రాబోయే డీఎస్సీలో వికలాంగుల విద్యా అభివృద్ధి కోసం 3 వేల స్పెషల్ టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో కిరణ్, సైదులు, భాస్కర్, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

'భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి'

మారేడ్‌పల్లి: ఉపాధ్యాయులు, విద్యార్థులను దేశానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్సీ కె.జనార్దన్‌రెడ్డి సూచించారు. సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి 20వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్-2012ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్‌లో భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని అన్నారు. కాలుష్య నివారణకు తీసుకోవాల్సిన బాధ్యతలను గురించి వివరించారు. ఈ సందర్భంగా నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రూపొందించిన పలు రకాల ప్రాజెక్టులు ప్రదర్శనలో పెట్టారు. పిల్లల్లోని శాస్త్ర సాంకేతిక అంశాలపై అభిరుచి, ఆసక్తి పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందని స్కూల్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో దూరదర్శన్ డైరెక్టర్ శైలజాసుమన్, డీఈఓలు ఎస్.చిరంజీవి, నెహ్రూ, సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మధుసూదన్‌రావు, అగస్టీన్, సైన్స్ అధికారి ప్రభాకర్, డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ అధికారి ఎ.సుబ్బారెడ్డి, గాయత్రి ఎడ్యుకేషనల్ జీఎం జీకేవీ సతీష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల సైన్స్ కాంగ్రెస్ -2012 ప్రారంభిస్తున్న జనార్ధన్‌రెడ్డి

'పేదరిక నిర్మూలనకు

ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలి'

ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభిస్తున్న నాదెండ్ల మనోహర్, వేణుగోపాల చారి

కవాడిగూడ: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషిచేసినప్పుడే పేదరిక నిర్మూలన జరుగుతుందని శాసన సభ స్పీకర్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అనే విషయంపై దృష్టి సారించాలని సూచించారు. శనివారం దోమలగూడలోని అశోక్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సివిల్ సర్వీసెస్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంత్రోపాలజీ ఫ్యాకల్టీ, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.అశోక్‌ల ఆధ్వర్యంలో రూపొందించిన ఆంత్రోపాలజీ 2,3,4 సిరీస్ పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. నాదెండ్ల మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలు, పట్టణప్రాంతాల్లో ఉన్న యువతలో మంచి మార్పు తీసుకువచ్చేందుకు లక్ష్యంగా సంస్థ ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేణుగోపాలచారి, అదిలాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.అశోక్, ఆంత్రోపాలజీ ఫ్యాకల్టీ పీవీ లక్ష్మయ్య, తెలుగు అకాడమీ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్ చైర్మన్ రామకృష్ణమూర్తి, ఇన్‌స్టిట్యూట్ అడ్వైజర్ సర్వమంగళగౌరీలతో పాటు ఇన్‌స్టిట్యూట్ సభ్యులు పాల్గొన్నారు.

క్యాంపస్ న్యూస్

31న టీవీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర స్థాయి కార్యకర్తల సమావేశాన్ని ఈ నెల 31న నిర్వహిస్తున్నట్టు సంఘం నాయకుడు కోట శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఇప్పటి వరకు టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగిన రాజారామ్ యాదవ్ పదవికి రాజీనామా చేశారని, తిరిగి నూతన అధ్యక్షుడి నియామకంతో పాటు భవిష్య కార్యాచరణపై ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశానికి అన్ని జిల్లాల నుంచి కార్యకర్తలు హాజరు అవుతారని, సమావేశ అనంతరం నూతన కమిటీని ప్రకటిస్తామని తెలిపారు.

నేడు ఎంబీఏ విద్యార్థులకు పరిచయ కార్యక్రమం

ఓయూలో కొత్తగా ఎంబీఏ కోర్సులలో చేరిన విద్యార్థులకు సోమవారం ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నూతన విద్యార్థులకు సోమవారం నుంచి తరగతులు ప్రారంభం అవుతున్నందున విద్యార్థులతో కళాశాలలో పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.శేఖర్ తెలిపారు. ఉదయం 11.30 గంటలకు ఎంబీఏ (రెగ్యులర్), విదేశీ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటలకు, టెక్నాలజీ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు సాయంత్రం 7 గంటలకు ఇండక్షన్ కార్యక్రమం ఉంటుందన్నారు.

1 నుంచి 'సెల్ఫ్ ఇంగ్లీష్' బ్యాచ్ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలోని సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ట్రైనింగ్‌లో ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నవంబరు 1 నుంచి ఇంగ్లీష్ శిక్షణ కోసం నూతన బ్యాచ్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఇ.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ శిక్షణా తరగతులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం 6గంటల నుంచి 8 వరకు రెండు గంటల పాటు జరుగుతాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు ఈ కోర్సులో చేరవచ్చని తెలిపారు. రెండు నెలల పాటు నిర్వహించే ఈ కోర్సులో చేరేందుకు రూ.3,500లు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, ఓయూ విద్యార్థులకు ఫీజులో 50శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ నెల 31లోపు ఫీజులు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 040-64575575, 9291611664 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

బ్లాక్ లిస్టులో ఉన్న కళాశాలలపై

క్రిమినల్ కేసులు పెట్టాలి: జేఏసీ

ఏఐసీటీఈ బ్లాక్‌లిస్టులో ఉన్న బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలపై క్రిమినల్ కేసులు పెట్టాలని, అలాగే ఆ యా కళాశాలల గుర్తింపును రద్దు చేయడంతో పాటు యాజమాన్యాల ఆస్తులు జప్తు చేయాలని టీఎస్ జేఏసీ ప్రధాన కార్యదర్శి కరాటే రాజు డిమాండ్ చేశారు. శనివారం ఒక ప్రకటన జారీ చేస్తూ ఏఐసీటీఈ అనుమతి లేకుండా బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలు నిర్వహిస్తూ విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయల ఫీజులు అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై 2010లోనే ఏఐసీటీఈ అనుమతులు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని అప్పటి ముఖ్యమంత్రి రోశయ్యకు వినతి పత్రాన్ని అందజేసినట్టు వెల్లడించారు. ఈ కళాశాలలపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

'జానపద కళలను ప్రోత్సహించాలి'

జానపద కళలను ప్రోత్సహించినప్పుడే ఈ కళకు, కళాకారులకు సరైన గుర్తింపు లభిస్తుందని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కిషన్‌రావు పేర్కొన్నారు. శనివారం ఓయూ మెకస్టర్ ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంస్కృతిక శాఖ, నాజర్ బుర్రకథ విద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన బుర్రకథ కళాపుష్కర మహోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాజర్, బుర్రకథ కళలకు గుర్తింపు తెచ్చిన మహావ్యక్తి అని, బుర్రకథను దేశవ్యాప్తంగా పరిచయం చేసింది ఆయనే అన్నారు. ఈ సందర్భంగా రాజు బుర్రకథ బృందం, బంగారుపాప బుర్రకథ బృందం చెప్పిన కథలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులు నను మాస స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాబు యాత్రను విజయవంతం చేయండి

అభిమానులకు, కార్యకర్తలకు బుక్కగోపాల్ పిలుపు

శంషాబాద్ ఎయిర్‌పోర్టు: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తలపెట్టిన మీకోసం వస్తున్నా యాత్ర నవంబర్ 4న రంగారెడ్డి జిల్లాలో ప్రారంభం కానున్నదేపథ్యంలో చంద్రబాబు యాత్రను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుక్క వేణుగోపాల్ టీడీపీ నాయకులకు, అభిమానులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. నవంబర్ 4వ తేదిన రంగారెడ్డి జిల్లాలోని గండీడ్ మండలం పగిడ్యాల్‌లో బాబు యాత్ర ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. యాత్రను విజయవంతం చేయడం కోసం టీడీపీ నాయకులు ఇప్పటి నుంచే కసరత్తు మొదలు పెట్టారని ఆయన న్నారు. యాత్రను విజయవంతం చేయడం కోసం భారీగా జన సమీకరణ చేయాలని పార్టీ నాయకులు భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, కుమార్‌యాదవ్, దండు ఇస్తారి, మోహన్‌రావు, నీరటిరాజు తదితరులు పాల్గొన్నారు.